క్లుప్తంగా

జీపీకి ఫ్రీజర్ అందజేత



పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీకి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బలరాం మాట్లాడుతూ.. ఈ ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన లయన్ సంజీవ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్రీజర్‌ను గ్రామస్తులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఎంపీడీవో రఘు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, కోశాధికారి మారుతీరెడ్డి, జిల్లా చైర్మన్లు నారాయణరెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు



కామారెడ్డి అర్బన్: స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తెలిపారు. ప్రతిభ చూపి సీహెచ్ వంశీ (400 మీటర్ల పరుగు), పి.జ్ఞానేశ్వర్(100 మీటర్ల పరుగు), కౌశిక్(షాట్‌పుట్)లను ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు అభినందించారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఇన్‌చార్జి పీడీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి శ్రవణ్ కుమార్, ఆర్ఐ కిరణ్, తదితరులు ఉన్నారు.

సోమారంపేటలో వైద్య శిబిరం ఏర్పాటు

మాచారెడ్డి: తండాలపై డెంగీ పంజా శీర్షికన ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో విద్య ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు చికిత్స నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు వివరించారు. అనుమానితుల నుంచి రక్తన మూనాలు సేకరించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆదర్శ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్ రావ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

బిచ్కుంద(జుక్కల్): ఎస్సీ, ఎస్టీ చిన్న సన్నకార రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని ఏవో అమర్ ప్రసాద్ అన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 50 శాతం, పెద్ద రైతులకు 40 శాతం రాయితీ వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పరికరాలు అందిస్తున్నామని, అవసరం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు దరఖాస్తు పెట్టుకోవాలని కోరారు. ఇప్పటి వరకు రాయితీపై యాంత్రీకరణ పొందని రైతులకు ముందు ప్రాధాన్యం ఉంటుందన్నారు. బ్యాటరీతో నడిచే చేతి పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటవేటర్, బ్రష్ కట్టర్, కల్టివేటర్, కేజీవీల్ ఇతర పరికరాలు అందిస్తున్నామన్నారు. మిగత వివరాలకు సంప్రదించాలని సూచించారు.

సరస్వతి అమ్మవారికి పూజలు

కామారెడ్డి అర్బన్: శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక ఇల్చిపూర్ శ్రీసరస్వతి అమ్మవారి దేవాలయం మహిళ భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు, లలితసహస్ర నామాల పారాయణం చేశారు. అర్చకులు దత్తురావు, విజయ్‌పాండే, సందీప్‌పాండే, ఆలయ ధర్మకర్త పార్శి విఠల్, మాజీ సర్పంచ్ కె.సిద్ధాగౌడ్ తదితరులున్నారు.


శిఖం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి: శిఖం భూములలో సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్, మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. నర్వ చెరువు కింద బఫర్ జోన్, శిఖం భూములలో సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.రైతులు గురు ప్రతాప్, భూమాగౌడ్ తదితరులున్నారు.

నాణ్యతకు తిలోదకాలు





ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కుంగిపోయిన ఫ్లోరింగ్, పగిలిన టైల్స్

- ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కుంగిన ఫ్లోరింగ్
- పదేళ్లు కాకముందే పగుళ్లు
- కాళ్లకు పగిలిన టైల్స్ గుచ్చుకుని ఇబ్బందులు పడుతున్న కక్షిదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో 2016లో రూ.63 లక్షలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని నిర్మించి అప్పటి మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. నిర్మించి పదేళ్లు కూడా కాకముందే ఫ్లోరింగ్ కుంగిపోయి టైల్ పగిలిపోయాయి. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాలకు చెందిన ప్రజలు ఇళ్లు, ప్లాట్లు తదితర వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడంతో పాటు టైల్స్ పూర్తిగా పగిలిపోయాయి. దీంతో కార్యాలయానికి వచ్చే వారికి అవి గుచ్చుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా నిర్మించడంతో పదేళ్ల కాకమునుపే ఫ్లోరింగ్ దెబ్బతిన్నది. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయించాలని, నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కక్షిదారులు కోరుతున్నారు.



రావాలంటే భయమేస్తోంది

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలంటేనే భయంగా ఉంది. నాకు పోలియో కారణంగా ఒక కాలు సరిగా పని చేయకపోవడంతో కుంటుకుంటూ నడుస్తాను. ఇటువంటి పరిస్థితిలో కార్యాలయంలో ఫ్లోరింగ్ పూర్తిగా పగిలిపోవడంతో టైల్స్ పగిలి ముక్కలుగా మారాయి. దీనిపై నుంచి నడవాలంటేనే భయంగా ఉంది.

– అంజాగౌడ్, సోమార్‌పేట్‌వాసి

మరమ్మతులు చేయించాలి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫ్లోరింగ్ పూర్తిగా పగిలిపోవడంతో కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయించి, కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– రాములు, ఎల్లారెడ్డివాసి

ఉన్నతాధికారులకు నివేదించాం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫ్లోరింగ్ టైల్స్ పగలడంతో కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్లోరింగ్ మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

– సురేంద్రబాబు, సబ్ రిజిస్ట్రార్, ఎల్లారెడ్డి

మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాత బాన్సువాడకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, కోతులు, కుక్కలు, దోమల బెడద నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని విన్నవించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని అన్నారు. నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, చీదరి సాయిలు, మోహన్‌రెడ్డి, చిరంజీవి, చీకట్ల రాజు, మహేష్, రామకృష్ణ, గంగారం, అనిల్, భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఎల్లారెడ్డి: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థినులకు వేధిస్తే షీటీం సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ శంకరయ్య, షీటీం, కళా బృందం సభ్యులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐ రాజారెడ్డి

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వాహనాలు నడిపించే వారు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై మురళి అన్నారు. ఎర్రాపహాడ్‌లో శుక్రవారం కళాబృందం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే కళాబృందం సభ్యులు పలు అంశాలను పాటల ద్వారా వివరించారు. కళాబృందం జిల్లా అధ్యక్షుడు రమేష్‌రావు, కళాకారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబరాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లి తండాలో శుక్రవారం గిరిజనులు తీజ్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా బంజార సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాదావత్ పరమేశ్, పూల్‌సింగ్ నాయక్, రవి, తండా పెద్ద మనుషులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



తిర్మన్‌పల్లి తండాలో తీజ్ సంబరాల్లో గిరిజనులు

రైతులందరూ సంఘటితం కావాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు పండిస్తున్న పంటలకు లాభసాటి ధరలు సాధించడం కోసం పార్టీలకతీతంగా రైతులందరూ సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీకేఎస్ మండల స్థాయి కార్యవర్గ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యల సాధన కోసం రైతులమంతా చేయి, చేయి కలిపి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర కోశాధికారి మాణిక్యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, గౌరవఅధ్యక్షుడు దేరెడ్డి విఠల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా విద్యుత్ ప్రముఖ్ రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు నగేష్

కొత్వాల్‌కు ఘన నివాళి

కామారెడ్డి అర్బన్: రాజాబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి (ఆర్‌బీవీఆర్‌ఆర్) విద్యా పరిషత్ ట్రస్టు ఆధ్వర్యంలో త్వరలోనే కామారెడ్డిలో విద్యార్థి వసతిగృహం, పాఠశాల, వృత్తి నైపుణ్య శిక్షణ భవన నిర్మాణం ప్రారంభిస్తామని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి అన్నారు. కొత్వాల్ వెంకట్రామ్‌రెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకట్రామ్‌రెడ్డి నిజాం హయాంలో మారుమూల గ్రామాల నిరుపేదల విద్యాభివృద్ధికి కృషి చేశారని ఆయన పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా కామారెడ్డిలోనూ విద్యాభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని రెడ్డి ఐక్యవేదిక నాయకులు అన్నారు. నాయకులు నాగర్తి చంద్రారెడ్డి, కొమిలి భీంరెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రెడ్డి ఐక్యవేదిక నాయకులు

పోడు రైతుల ధర్నా

మాచారెడ్డి: పోడు రైతులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మోతీరాంనాయక్, కొత్త నర్సింలు మాట్లాడారు. అక్కాపూర్‌లో 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ అధికారులు దౌర్జన్యం చేస్తూ వేసిన పంటలను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలపై నిషేధిత గడ్డి మందులు చల్లడం సరికాదన్నారు. నాయకులు బాబు, మహేశ్, నరేశ్, ఉన్నారు.



మాచారెడ్డిలో ధర్నా చేస్తున్న పోడు రైతులు

పంటల పరిశీలన

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గండివేట్, గౌరారం, సర్వాపూర్, ముదొల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. వరి పంటను పరిశీలించి సస్యరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయా గ్రామాల రైతులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం గండివేట్, పోతంగల్ కలాన్ గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిలువలను పరిశీలించినట్లు తెలిపారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లి, దేవాయిపల్లి గ్రామ శివారులో పంటలను శుక్రవారం ఏవో నర్సింలు పరిశీలించారు. పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కలుపు మొక్కలను తొలగించి పచ్చదోమ, రసంపీల్చే పురుగుల నివారణకు కోసం ఎసిటమిప్రిడ్, థైమెథోక్సమ్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వర్షాలు అధికంగా కురియడం వల్ల పంటలు కొద్దిగా దెబ్బతిన్నాయని, ట్రిబుల్19ను కూడా నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

యూరియా కొరత తీర్చాలని వినతి

దోమకొండ: యూరియా కొరత తీర్చాలని కోరుతూ శుక్రవారం దోమకొండ సింగిల్‌విండో పాలకవర్గం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందజేశారు. యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన యూరియా సప్లయ్ విషయంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పన్యాల నాగరాజ్‌రెడ్డి, డైరెక్టర్‌లు శంకర్‌రెడ్డి, అంకత్ నర్సింలు, పోతుల రాజు, తదితరులు ఉన్నారు.

పనుల జాతర ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 2025 సంవత్సర పనుల జాతర కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో శుక్రవారం అధికారులు ప్రారంభించారు. గ్రామసభలు నిర్వహించి ఏఏ పనులు చేపట్టాలో చర్చించి పనులను గుర్తించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజు పనిచేసిన కూలీలను సన్మానించారు.



జంగమాయిపల్లిలో గొర్రెల షెడ్డుకు భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత



పారడపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



బీబీపేటలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న అధికారులు



నస్రుల్లాబాద్‌లో పౌల్ట్రీ ఫాం ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి దయానంద్



భిక్కనూరులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు..



నాగిరెడ్డిపేట పరిషత్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న అధికారులు



దోమకొండలో ..



బోర్లంలో పనులకు భూమిపూజ చేస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, అధికారులు



తాడ్వాయిలో ఉపాధి హామీ కూలీ మెట్టు చిన్న సాయిలును సన్మానం చేస్తున్న అధికారులు



ముంబోజిపేటలో పశువుల పాక నిర్మాణానికి..



గుడాతండాలో..



గాంధారిలో పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

పెచ్చులూడుతున్న ఆరోగ్య ఉప కేంద్ర భవనం




తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్ర భవనం పెచ్చులు ఊడి పడుతున్నాయి. 10 రోజుల పాటు వర్షాలు కురియడంతో స్లాబ్ నుంచి నీరు కిందికి దిగుతోందన్నారు. ఈ విషయాన్ని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని, ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ కేంద్రాన్ని ఇతర భవనంలోకి మార్చాలని, లేకుంటే నూతన భవనాన్ని నిర్మించాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.

ప్రతి గ్రామంలో నూతన సంఘాలను ఏర్పాటుచేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రతిగ్రామంలో నూతనంగా వృద్ధులు, దివ్యాంగులు, కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని నాగిరెడ్డిపేట ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి ఒక సంఘం చొప్పున తప్పనిసరిగా నూతన సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు 2025– 26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో ప్రతినెలా తప్పనిసరిగా స్వయం సహాయక సంఘాల సమావేశాలను నిర్వహించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంత, ప్రధాన కార్యదర్శి మంజుల, కోశా ధికారి మమత, సీసీలు పాల్గొన్నారు.

చెరువు శిఖం సర్వే చేయండి

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు శిఖం భూములను సర్వే చేయాలని శుక్రవారం ఆయకట్టు ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత చెరువు కింద నర్వ, అన్నాసాగర్ గ్రామాల పరిధిలో 380 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే చెరువు శిఖం భూముల్లో వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు బోర్లు వేసి, పంటలు సాగు చేస్తున్నారని, కబ్జాలను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎల్లారెడ్డి మండల రెవెన్యూ అధికారులకు రైతులు వినతి పత్రం అందజేశారు.



సంక్షిప్తం

నేడు గాంధీ చౌక్ వద్ద అన్నప్రసాదం వితరణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద అమావాస్య సందర్భంగా శనివారం అన్నప్రసాదం వితరణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు అమావాస్య అన్నప్రసాద వితరణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతి అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

అలరించిన విద్యార్థుల కోలాటం

మాచారెడ్డి: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా చుక్కాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పాల్వంచ మండలం సింగరాయపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. భక్తి పాటలకు అనుగుణంగా కోలలు వేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

మట్టి విగ్రహాలనే పూజిస్తాం

కామారెడ్డి అర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణం కాపాడుతామని, మట్టి గణేష్ విగ్రహాలనే పూజిస్తామని, థర్మకోల్, ప్లాస్టిక్ అలంకరణలు వినియోగించబోమని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శుక్రవారం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య, అధ్యాపకులు జి.శ్రీనివాస్‌రావు, రాజ్‌గంభీర్‌రావు, జయప్రకాష్, విశ్వప్రసాద్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ప్రతినిధులు గాదారి గంగారెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, చిట్టెపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి పోస్టు కార్డులు పంపిన ఉద్యమకారులు

బాన్సువాడ: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీకి శుక్రవారం మలిదశ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో బాన్సువాడ పోస్టాఫీసులో పోస్టు కార్డులు పంపించారు. ఈ సందర్భంగా మలిదశ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యమకారుల ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమకారులు చందు, దండు విజయ్, భాస్కర్‌గౌడ్, సాయిబాబా, శ్యాం, కృష్ణ, హన్మండ్లు, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను పలు గ్రామాల బాధితులకు పంపిణీ చేశారు. నాయకులు రమేష్‌యాదవ్, మల్లయ్యగారి ఆకాష్, తోట రాజు తదితరులున్నారు.

చాముండేశ్వరి ఆలయంలో చండీయాగం

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా గణేశ రుద్ర చండీయాగం నిర్వహించారు.

సాయంత్రం సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి, డైరెక్టర్‌లు రమేష్, బాల్‌రాజ్, అర్చకులు భావి శరత్‌చంద్రశర్మ, మాజీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, భక్తులు పాల్గొన్నారు.